
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ; 8 ; జూలై ; 2025



సోమశిలలో 29.710 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 29.710 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్‌డెల్టాకు 2,600, ఉత్తర, దక్షిణ కాలువలకు 825 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.99,630
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,010
3 శాతం జీఎస్టీతో	రూ.9,280
నవర (8 గ్రా)	రూ.74,240

గరిష్టం/కనిష్టం
37.3 /30.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం మేఘావృతంగా ఉండి, చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సోమవారం గాలిలో తేమ 43 శాతంగా నమోదైంది.

భవిష్యత్ స్వాప్నికుడు

- జలసిరులు పారించిన జలయాజ్ఞికుడు
- కృష్ణపట్నం పోర్టు, విద్యుదుత్పత్తి కేంద్రాలతో వెలుగులు నింపిన వెన్నెల రేడు
- శ్రీసిటీ, మాంబట్టు, మేనకూరు పారిశ్రామివాడలతో అభివృద్ధికి బీజాలు వేసిన పాలికుడు
- లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించిన వల్లభుడు
- సింహపురి అభివృద్ధిలో రాజన్న ముద్ర



వైఎస్సార్.. భవిష్యత్ స్వాప్నికుడు. వర్షపు నీటిని ఒడిసి పట్టి సాగుకు మళ్లించిన అపర భగీరథుడు. పుడమి తల్లిని పులకింప చేశారు. సింహపురి సిగలోని జలనిధి నుంచి గంగమ్మను ఉరకలెత్తించారు. బంజరు భూములకు జలసిరులు అందించి బంగరు భూములుగా మార్చిన జలయాజ్ఞికుడు. ఉమ్మడి జిల్లా తీరంలో మధ్య భాగంగా కృష్ణపట్నంలో పోర్టు నిర్మించి ప్రపంచ స్థాయి పటంలో నెల్లూరుకు స్థానం కల్పించిన భవిష్యత్ స్వాప్నికుడు. పవర్ ప్రాజెక్టులతో జిల్లాలో వెలుగులు నింపిన వెన్నెల రేడు. పారిశ్రామిక సెజ్‌లతో విదేశీ సంస్థలను స్థాపించి అభివృద్ధికి బీజాలు వేసిన పాలికుడు. నిరుద్యోగాన్ని రూపు మాపి లక్షల కుటుంబాల్లో సంతోషాన్ని నింపిన వల్లభుడు. దశాబ్దన్నర కాలం గడిచినా జిల్లా అన్నదాతల మదిలో రాజన్న స్థానం పదిలం. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు

సమగ్ర సోమశిల నెరవేర్చిన జలయాజ్ఞికుడు

దాదాపు మూడు దశాబ్దాలపైకు పైగా నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వందల రూ.కోట్లతో ప్రాజెక్టులకు పునాదులతో జలయజ్ఞానికి శ్రీకారం చుట్టిన పాలక కర్షకుడు. 2004 ఎన్నికలకు ముందు 48 టీఎంసీలకే పరిమితమైన సోమశిల నీటి సామర్థ్యాన్ని రెండు దశల్లో 78 టీఎంసీల స్థాయికి తీసుకు వచ్చారు. సమగ్ర సోమశిలలో భాగంగా 104 కిలో మీటర్ల పొడవునా ఉత్తర కాలువను సోమశిల నుంచి ప్రకాశం జిల్లా కందుకూరు వరకు అభివృద్ధి చేసి నీటి ఔట్ ఫ్లో సామర్థ్యాన్ని పెంచారు.

వృథా నీటి ఒడిసి పట్టి..

వృథాగా సముద్రంలో కలుస్తున్న కృష్ణా నది వరద నీటిని శ్రీశైలం డ్యాం నుంచి కరువు ప్రాంతమైన రాయలసీమకు కేవలం 1,500 క్యూసెక్కుల తరలించేందుకు గతంలో ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని అధికారికంగా 44 వేల క్యూసెక్కులని చెప్పినా వాస్తవంగా 1.10 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంతో రోజుకు దాదాపు 10 టీఎంసీలు తరలించే విధంగా అభివృద్ధి చేశారు. పెన్నార్ డెల్టాతో పాటు మెట్ట ప్రాంత భూములను సస్య శ్యామలం చేసేందుకు జలయజ్ఞం ద్వారా రూ.220 కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

సంగం బ్యారేజ్ నిర్మాణంతో..

జిల్లాలోనే కీలక ప్రాజెక్టులైన సంగం, పెన్నా బ్యారేజీలపై దృష్టి సారించి 2006 మే 28న రూ.98 కోట్ల వ్యయంతో సంగం బ్యారేజీ శంకుస్థాపన చేశారు. 800 మీటర్ల పొడవుతో దీన్ని నిర్మించి 0.45 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో పాటు డెల్టా స్థిరీకరణకు దోహదపడేలా సిద్ధం చేశారు. అయితే నిర్మాణ వ్యయం పెరగడంతో 2008లో రీ టెండర్లు నిర్వహించి ప్రాజెక్ట్ వ్యయాన్ని రూ.149.60 కోట్లకు పెంచి పనులు వేగవంతం చేశారు. ఆయన మరణానికి ముందు వరకు 40 శాతం పనులు పూర్తయ్యాయి. తదనంతర పాలకులు నిర్లక్ష్యం వహించడంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై దృష్టి సారించి ప్రజలకు అంకితం చేశారు.

పెన్నా బ్యారేజ్‌తో..

2008లో పెన్నాబ్యారేజ్ రూ.126 కోట్ల వ్యయంతో నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. 0.55 టీఎంసీ నీటి సామర్థ్యంతో తలపెట్టిన పెన్నా బ్యారేజీ తదనంతరం రీ టెండర్ల ద్వారా రూ.149.39 కోట్లకు చేరింది. దివంగత మహానేత హయాంలో పరుగులు తీసిన అభివృద్ధి మళ్లీ ఆయన తనయుడు దృష్టి సారించి పూర్తి చేశారు. 57 గేట్లతో 637 మీటర్ల పొడవుతో 10.90 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహానికి అనుగుణంగా బ్యారేజ్‌ని నిర్మించారు.

మహానేత దూరదృష్టి.. అభివృద్ధి సృష్టి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ దూరదృష్టితో అభివృద్ధి సృష్టించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 169 కి.మీ. పొడవైన సముద్ర తీరంలో మధ్య భాగం కృష్ణపట్నంలో పోర్టును నిర్మించారు. ఈ పోర్టు ద్వారా ఎగుమతులు, దిగుమతులతో ప్రపంచ స్థాయిలో సింహపురి కీర్తిని నిలిపారు. ఈ పోర్టు ద్వారా జిల్లాలో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు బీజాలు వేశారు. జిల్లాకే కాకుండా రాష్ట్ర, కేంద్ర ఖజానాలకు ఆదాయ వనరుగా మార్చారు. మరో వైపు అదే ప్రాంతంలో ప్రభుత్వ రంగంలో 2,400 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టి.. జిల్లాలో వెలుగులు నింపారు.

స్వర్ణాల.. భక్త జనసంద్రం

సింహపురి దారులన్నీ బారాషహీద్ దర్గా వైపే మళ్లాయి. స్వర్ణాల భక్త జనసంద్రమైంది. రొట్టెల పండగకు రెండో రోజు సోమవారం కూడా భక్తులు పోటెత్తారు. స్వర్ణాల చెరువు తీరాన పవిత్రస్నాన మాచరించి తీరిన కోర్కెలతో భక్తులు రొట్టెలు వదలగా.. కోర్కెలతో వచ్చిన భక్తులు మాత్రం రొట్టెలు పట్టుకున్నారు. అనంతరం బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని సమాధులను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. తమ ఆకాంక్షలు నెరవేరాలని మొక్కుకున్నారు. బారాషహీద్ దర్గాలో గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గంధాన్ని షహీదుల సమాధులకు లేపనం చేసిన అనంతరం భక్తులకు పంచి పెట్టారు.

- రెండో రోజూ రొట్టెల పండగకు పోటెత్తిన భక్తులు
- బాటలన్నీ బారాషహీద్ వైపే
- నేత్ర పర్వంగా గంధమహోత్సవం
- అబ్బుర పరిచిన ఫకీర్ల విన్యాసాలు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగ రెండో రోజు సోమవారం అంగరంగ వైభవంగా కొనసాగింది. దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువు జన సంద్రంగా మారింది. లక్షలాది మంది భక్తజనంతో స్వర్ణాల తీరం పులకించింది. భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వర్ణాల చెరువులో స్నానమాచరించి మదినిండా కోర్కెలతో



షహీదులను దర్శించుకుంటున్న భక్తులు

విచ్చేసిన భక్తులు తమ ఆకాంక్షలు తీరాలంటూ రొట్టెలు పట్టుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులే కాక, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ఐదు రోజుల పాటు జరిగే రొట్టెల పండగ అంగరంగ వైభవంగా జరుగుతోంది. దేశ, విదేశాల నుంచి కూడా వస్తున్న భక్తులు తమ మొక్కులు తీర్చుకొని తరలి వెళ్తున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షిస్తున్నారు. స్వర్ణాల చెరువులో బోటు షికారు, చిన్నారులు కేరింతలు, కిటకిటలాడే దుకాణాలతో ఎటు చూసిన భక్త జన సంద్రంలో కోలాహలంగా మారింది.

ఆరోగ్యం, ఉద్యోగం, వివాహ రొట్టెలకు డిమాండ్

స్వర్ణాల చెరువు ఘాట్‌లో ప్రత్యేకంగా రొట్టెల బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రధానంగా విద్య, ఆరోగ్య, సౌభాగ్య, ఉద్యోగ, వివాహ, సంతాన రొట్టెలు బోర్డులు కన్పిస్తున్నాయి. అయితే ఈ ఏడాది ఎక్కువ మంది భక్తులు ఆరోగ్యం, ఉద్యోగం, వివాహ రొట్టెలకు అధిక ప్రాధాన్యమివ్వగా తక్కువగా ఐశ్వర్యం, సంతానం, గృహం, విదేశీయానం తదితర కోర్కెల రొట్టెల కోసం భక్తులు పోటీపడడం విశేషం.

సౌకర్యాలు, ఏర్పాట్లపై అధికారుల పర్యవేక్షణ

దర్గా ప్రాంగణంలో భక్తుల సౌకర్యాలు, ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్‌తోపాటు కార్పొరేషన్ అధికారులు, జిల్లా పోలీస్ అధికారులు సందర్శించారు. రొట్టెల పండగకు హాజరయ్యే భక్తుల సౌకర్యాలు, ఏర్పాట్లు పర్యవేక్షించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసినా సీసీ కెమెరాల మానిటరింగ్ కేంద్రం నుంచి అన్నీ ప్రాంతాలను పరిశీలించారు. భక్తులు రద్దీ పెరిగినా తగ్గట్లు సౌకర్యాలు నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. పోలీసుశాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మానటరింగ్ కేంద్రం నుంచి పర్యవేక్షిస్తోంది. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో షిఫ్టుల వారీగా దగ్గరుండి బందోబస్తు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా సమీక్షిస్తున్నారు.

పరిమిళించిన భక్త సుగంధం

- వేడుకగా బారాషహీద్‌ల గంధ మహోత్సవం

నెల్లూరు (బృందావనం): మైమరిపించే సుగంధ పరిమళాల గుభాళింపులు, అత్తరుల సువాసనలు, భక్తి విశ్వాసాల నడుమ బారాషహీద్‌ల స్మరణలతో ఫకీర్ల జరబులు, హోరెత్తించే సంగీత వాయిద్యాల, హుషారు తెప్పించే తీన్‌మార్, డీజే బృందగానాలు, పూలచాందినీలు, విద్యుద్దీప కాంతులు, బాణసంచా వెలుగుల్లో భక్తి ప్రపత్తులతో బారాషహీద్‌ల గంధ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి వేడుకగా సాగింది. గంధ మహోత్సవంలో భాగంగా జెండా వీధి కోటమిట్ట అమీనియా మసీదులో సంప్రదాయంగా మత పెద్దలు, పీఠాధిపతుల ఆధ్వర్యంలో అత్తర్లు, సుగంధ ద్రవ్యాలు, పన్నీరు, పవిత్ర జలం కలిపిన పవిత్ర గంధాన్ని మతపెద్ద సయ్యద్ సమీహుస్సేని 12 బిందెల్లో భక్తిశ్రద్ధలతో కలిపారు. గంధంతో నిండిన మొదటి బిందెను ప్రత్యేక ప్రార్థనలు, నమాజులు చేసి సోమవారం రాత్రి 11.30 గంటలకు షేక్ ఖలీల్ అహ్మద్ శిరస్సుపై ధారణ చేశారు. మిగిలిన 11 బిందెలను మరో 11 మంది శిరస్సులపైకెత్తుకొన్నారు. పవిత్ర గంధం నింపిన బిందెలను ప్రత్యేక వాహనంలో భారీ బందోబస్తు నడుమ దర్గా వద్దకు అర్ధరాత్రికి చేరింది. కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీపుల్లా హుస్సేనీ, సయ్యద్ సమీహుస్సేనీల ఆధ్వర్యంలో ముజావర్లు, ఫకీర్లు తొలుత దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు (దువా, నమ) చేశారు. ఈద్గా వద్ద నుంచి 12 బిందెల్లో తెచ్చిన గంధాన్ని బారాషహీద్‌ల సమాధులకు లేపనం చేశారు. భక్తజనం గంధ మహోత్సవాన్ని తిలకించి పరవశించిపోయారు. తదుపరి గంధాన్ని భక్తులకు పంచారు. గంధాన్ని అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. కార్యక్రమాన్ని బారాషహీద్ దర్గా రొట్టెల పండగ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, సభ్యులు, అధికార యంత్రాంగం పర్యవేక్షించింది.



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

పచ్చ గూండాల అరాచకం



పచ్చమూకల గూండాల దాడిలో ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న ప్రసన్న, అనిల్, పర్వతరెడ్డి తదితరులు

జిల్లాలో పచ్చ కిరాయి గూండాల అరాచకం సంచలనం సృష్టించింది. నెల్లూరు నగరంలోని సుజాతమ్మకాలనీలో ఉన్న మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో సోమవారం రాత్రి బీభత్సం సృష్టించారు. రాజకీయ చైతన్యానికి, హుందా రాజకీయాలకు మారు పేరైన నెల్లూరులో రెడ్ బుక్ రాజ్యాంగం వెర్రితలలు వేస్తోంది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న చేసిన విమర్శలను జీర్ణించుకోలేని పచ్చమూకలు ఇంట్లో ప్రసన్న తల్లి శ్రీలక్ష్మమ్మ ఒకటే ఉన్న రాత్రి సమయంలో మారణాయుధాలతో దాడికి తెగబడ్డారు. ముందుగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఇంట్లోని ప్రతి గదిలో బీభత్సం చేశారు.

దాడికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ప్రసన్నకుమార్‌రెడ్డి ఫిర్యాదు

నెల్లూరు (క్రైమ్): తన ఇంటిపై దాడికి ప్రోత్సహించిన, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు సోమవారం అర్ధరాత్రి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, పోలుబోయిన రూప్ కుమార్‌యాదవ్, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ప్రోద్బలంతోనే విధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కోవూరులో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ వైఫల్యాలను, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వింతపోకడలపై నాయకులు విమర్శలు చేశారు. అనంతరం ప్రసన్నకుమార్‌రెడ్డి, తన కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులతో అక్కడే ఉన్నారు. రాత్రి 9 గంటల సమయంలో నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని ఆయన ఇంటికి సుమారు వంద మందికి పైగా రౌడీమూకలు మారణాయుధాలతో దౌర్జన్యంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మా ఎమ్మెల్యే ప్రశాంతమ్మని విమర్శిస్తావా? నిన్ను చంపేస్తామంటూ పెద్ద పెద్దగా కేకలు వేస్తూ ఇళ్లంతా ధ్వంసం చేశారు. రౌడీ మూకల ఆగడాలతో బెంబేలెత్తిన ప్రసన్నకుమార్‌రెడ్డి తల్లి శ్రీలక్ష్మమ్మ బెడ్ రూమ్‌లో తలుపులు వేసుకోగా వాటిని సైతం పగులగొట్టారు. దీంతో భయాందోళనకు గురైన ఆమె బాత్ రూమ్‌లో బిక్కుబిక్కుమంటూ తలదాచుకుంది. పోర్టికోలో ఉన్న బెంజ్ కారును దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసన్నకుమార్‌రెడ్డి తన కుమారుడుతో కలిసి ఇంటికి చేరుకుని పరిశీలించారు. దాడి సమయంలో ఇంటిలో ఉంటే తనను హత్య చేసి ఉండే వారని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రసన్నకుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఇంట్లో ధ్వంసమైన ఫర్నీచర్



ప్రసన్నను విచారిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీలు

కనికరం చూపండయ్యా..

• అధికారులకు అర్జీదారుల వినతి



అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్‌): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ అర్జీలను ఇస్తున్నామని.. ఎంపీడీఓలు, తహసీల్దార్లు పట్టించుకోకపోవడంతో విసిగివేసారిపోయామని.. మీరైనా పరిష్కరించాలని పలువురు అర్జీదారులు కోరారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. అర్జీలను జేసీ కార్తీక్‌, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌, డ్వామా పీడీ గంగాభవాని, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు స్వీకరించారు. ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో కలిపి సుమారు 400 అర్జీలు అందాయి.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. ప్రజలు అందజేసే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఒకవేళ అలా కాకపోతే అందుకు గల కారణాలను తెలియజేయాలని సూచించారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అధికారుల తప్పిదానికి సంక్షేమ పథకాలు కట్



చేపలు పట్టుకొని నేను, నా భార్య పోలమ్మ జీవిస్తున్నాం. మాకు ముగ్గురు పిల్లలు. ప్రభుత్వం గతంలో నిర్వహించిన హౌస్‌ హోల్డ్‌ సర్వేలో నా రేషన్‌ కార్డులో పోలమ్మ పేరును పోలయ్యగా వెబ్‌సైట్‌లో అధికారులు చూపారు. పోలయ్యకు ప్రభుత్వోద్యోగం ఉందంటూ రేషన్‌ కార్డులో ఐడీ నంబర్‌ను ఇచ్చారు. దీంతో సంక్షేమ పథకాలు రద్దు కావడంతో పాటు ఆరోగ్యశ్రీ వర్తించలేదు. అధికారుల తప్పిదానికి బలయ్యాం. సచివాలయాలు.. తహసీల్దార్‌ చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. కలెక్టరేట్‌కు మూడుసార్లు వచ్చినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.

– కునాసి వెంకటేశ్వర్లు, రవీంద్రాపురం, విడవలూరు మండలం

పొదుపులో దాచుకున్న డబ్బును కాజేశారు



రాష్ట్రంలోనే తొలిసారిగా పొదుపు మహిళల కోసం లేగుంటపాడులో ఏర్పాటు చేసిన బ్యాంక్‌లో నెలకు రూ 2500 చొప్పున అక్టోబర్‌, 2018 నుంచి చెల్లించా. దీని మెచ్యూర్టీ కింద గతేడాది మార్చిలో రూ 2.35 లక్షలు రావాల్సి ఉంది. ఈ మొత్తాన్ని బ్యాంక్‌ సీఈఓ ప్రసాద్‌రెడ్డి చెల్లించలేదు. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా, డీఆర్డీఏ అధికారులు, డీసీఓ కార్యాలయాధికారి నిర్మల విచారణ జరిపారు. దీంతో చెక్కును ఇవ్వగా, బ్యాంక్‌లో జమచేయగా బౌన్సయింది. అధికారులకు మరోసారి ఫిర్యాదు చేయగా, కోవూరు కోఆపరేటివ్‌ డిపార్ట్‌మెంట్‌ ఎస్డీఎల్సీఓ సుభాషిణి విచారణ జరిపారు. నగదును మూడు రోజుల్లో ఇస్తానని మీడియా సమక్షంలో గత నెల 23న ప్రసాద్‌రెడ్డి చెప్పినా, నేటికీ ఇవ్వలేదు.

– ఏలూరు సుజాతమ్మ, లేగుంటపాడు, కోవూరు మండలం

విచారణలో అభిప్రాయం చెప్పడమే తప్పా..?



భర్త దూరమయ్యారు. ఇద్దరు ఆడబిడ్డలు. రూ.13 వేల వేతనంతో ఏఎస్‌పేట పీహెచ్‌సీలో ఎఫ్‌ఎన్వోగా పనిచేస్తున్నా. డాక్టర్లు, కాంట్రాక్ట్‌ స్టాఫ్‌ నర్సు లక్ష్మికి జరిగిన వివాదంలో ఉన్నతాధికారులు విచారణ జరిపారు. లక్ష్మిపై నా అభిప్రాయాన్ని తెలిపా. అయితే అనుకూలంగా అభిప్రాయం చెప్పలేదనే ఉద్దేశంతో లక్ష్మి తీవ్ర వేధింపులకు గురిచేశారు. చదువుకోనీయకుండా కెరీర్‌ను దెబ్బతీశారు. ఎలాంటి తప్పు లేకపోయినా నర్సు, డాక్టర్లతో పాటు నన్ను జొన్నవాడ పీహెచ్‌సీకి బదిలీ చేశారు. దీన్ని రద్దు చేయాలి.

– దొరసానమ్మ, ఎఫ్‌ఎన్వో, ఏఎస్‌పేట పీహెచ్‌సీ

బదిలీల ప్రహసనం

- ఇష్టారాజ్యంగా సచివాలయ ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్
- మూడు రోజులు రాత్రి పూట ప్రక్రియ
- తాజాగా మరోసారి నిర్వహణ
- గ్రేడ్ – 3లకు అన్యాయం
- ప్రమోషన్లు పొందిన వారిని కదిలించలేని వైద్యశాఖ
- ఖాళీలు చూపించరు.. షెడ్యూల్ ఉండదు
- ఎమ్మెల్యేల సిఫార్సులతో గందరగోళం



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం

నెల్లూరు(అర్బన్‌): జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంల సాధారణ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రహసనంలా మారింది. ఉన్నతాధికారులు చెప్పారంటూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. వారం క్రితం రాత్రి వేళ రహస్యంగా నిర్వహించి.. పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలంటూ రీ కౌన్సెలింగ్ చేపట్టేందుకు వైద్యశాఖాధికారులు ఉపక్రమిస్తున్నారు. నోరున్న యూనియన్ నేతలు, కూటమి నాయకుల సిఫార్సు లేఖల మేరకు పట్టణ ప్రాంతాల పరిధిలో పనిచేస్తూ ఉద్యోగోన్నతులు పొందిన వారి కోసం.. గ్రేడ్ – 3 నర్సులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రక్రియలో ముందుగా షెడ్యూల్‌ను ప్రకటించడం, ఖాళీలు చూపడంలేదని సచివాలయ పరిధిలోని నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతో గందరగోళం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఇలా..

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎం పోస్టులను గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేశారు. అప్పటికే ఒకరున్నా, 2500 జనాభాకు ఒకరు ఉండాలనే లక్ష్యంతో రెండో ఏఎన్‌ఎం పోస్టులు (గ్రేడ్ – 3)ను కేటాయించారు. అప్పట్లో దశల వారిగా 850 మందిని నియమించారు.

ఉద్యోగోన్నతులు.. కదలని నర్సులు

సీనియార్టీ ప్రాతిపదికన సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 289 మంది గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలకు నాలుగు నెలల క్రితం గ్రేడ్ – 2లుగా ఉద్యోగోన్నతులను కల్పించి పీహెచ్‌సీలకు కేటాయించారు. దీంతో సచివాలయాల నుంచి వైద్యశాఖ పరిధిలోకి వీరొచ్చారు. జీతాలనూ పీహెచ్‌సీల నుంచే పొందుతున్నారు. వీరిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బదిలీ చేసినా, ఎక్కడికీ కదల్లేదు. సచివాలయాల్లోనే ఇప్పటికీ విధులు నిర్వర్తిస్తున్నారు.

తాజాగా మరోసారి కౌన్సెలింగ్

సాధారణ బదిలీల్లో భాగంగా 459 మంది గ్రేడ్ – 3 సచివాలయ ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్‌ను గత నెల 30, ఈ నెల ఒకట్రెండు తేదీల్లో రాత్రిపూట జూమ్ ద్వారా నిర్వహించారు. బదిలీలకు సంబంధించిన స్థానాలను చూపిస్తూ ఆర్డర్లను కూడా తయారు చేసిచ్చారు. దీంతో వీరందరూ పలు సచివాలయాల్లో చేరాల్సి ఉంది. అప్పటికే ఉద్యోగోన్నతి పొంది అక్కడ పనిచేస్తున్న గ్రేడ్ – 2 ఏఎన్‌ఎంలు పీహెచ్‌సీలకు వెళ్లాల్సి ఉంది. దీంతో కొందరు యూనియన్ నేతలు, ప్రమోషన్లు పొందిన వారు తమను మార్చొద్దంటూ ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు తెచ్చారు. ఈ తరుణంలో కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల నేపథ్యంలో ఇప్పటికే కౌన్సెలింగ్ జరిగి బదిలీ అయిన గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలకు మరోసారి నిర్వహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. మరో సచివాలయానికి కాకుండా వేరే మండలానికి మార్చాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో ఈ 459 మందికి మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించేందుకు డీఎంహెచ్‌ఓ సుజాత ఏర్పాట్లు చేశారు. ఖాళీలు చూపడం.. షెడ్యూల్‌ను ప్రకటించడం.. పేపర్ ప్రకటనలు.. ఇలాంటివేవీ ఇవ్వలేదు. అంతా రహస్యంగా జరిపేందుకు చర్యలు చేపట్టారు. అసలు ఎన్నడూ లేని విధంగా జూమ్ ద్వారా కౌన్సెలింగ్‌ను నిర్వహించడంలోనే మతలబు ఉంది. నర్సులందరూ ఒక చోటకొస్తే ప్రశ్నించే అవకాశముంది. అలా కాకుండా ఎవరింట్లో వారుంటూ ఫోన్ ద్వారా జూమ్‌లో పాల్గొంటే ప్రశ్నించేందుకే ఆస్కారం ఉండదు. అందుకే ఇలా వ్యవహరించారనే చర్చా సాగుతోంది.

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



ఓసారి కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలను బదిలీ చేసిన మాట వాస్తవమే. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరికి రీ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నాం. దీనికి రెండు రోజులు సమయం పట్టొచ్చు. ఇందులో మా పాత్రమే ఉండదు.

– సుజాత, డీఎంహెచ్‌ఓ

రీ కౌన్సెలింగ్ వద్దంటూ ఆందోళన



నెల్లూరు(అర్బన్‌): సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న తమకు బదిలీల విషయంలో రీ కౌన్సెలింగ్‌ను నిర్వహించొద్దని గ్రేడ్ – 3 ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నాను సోమవారం నిర్వహించిన అనంతరం జేసీ కార్తీక్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గ్రేడ్ – 3 ఏఎన్‌ఎం అసోసియేషన్ జిల్లా నేతలు జయలక్ష్మి, వాణి మాట్లాడారు. గ్రేడ్ – 3 నుంచి గ్రేడ్ – 2కు ఉద్యోగోన్నతి పొందిన ఏఎన్‌ఎంలు వారికి కేటాయించిన సబ్ సెంటర్లకు వెళ్లకుండా సచివాలయాల పరిధిలోనే ఉన్నారని చెప్పారు. సచివాలయాల పరిధిలో ఖాళీలు చూపొద్దని అధికారులను ఒత్తిడి చేసే సరికి, తమకు రీ కౌన్సెలింగ్‌ను నిర్వహించి వేరే మండలానికి కేటాయిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ఇదే జరిగితే తాము తీవ్రంగా నష్టపోతామని పేర్కొన్నారు. పదోన్నతి పొందిన వారిని సబ్ సెంటర్లకు బదిలీ చేయాలని, అలా కాని పక్షంలో కౌన్సెలింగ్‌ను రద్దు చేసి తాము ఇప్పుడు పని చేస్తున్న ప్రదేశంలోనే ఉంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రక్రియను తాము అంగీకరించేదిలేదని స్పష్టం చేశారు.

కార్లు ఢీకొని.. రోడ్డు పక్కకు దూసుకెళ్లి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు



వెంకటేశ్వర్లు (ఫైల్)

• బస్సు కోసం నిరీక్షిస్తున్న వ్యక్తిని కబళించి

దుత్తలూరు: కార్లు ఢీకొని.. బస్సు కోసం నిరీక్షిస్తున్న వ్యక్తిపైకి దూసుకెళ్లాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని నందిపాడు కూడలిలో గల జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బండిపై గోలీ సోడాను విక్రయిస్తూ నందిపాడుకు చెందిన నల్లబోతుల వెంకటేశ్వర్లు (54) జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో ఉదయగిరి వెళ్లేందుకు గానూ బస్సు కోసం నందిపాడు సెంటర్‌లో రోడ్డు మార్జిన్‌లో వేచి ఉన్నారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి తిరుపతి వెళ్తున్న కారు ఉదయగిరి నుంచి సంగానికి వెళ్తున్న కారును ఢీకొని రోడ్డు పక్కన ఉన్న వెంకటేశ్వర్లు.. ఆపై గృహాలపైకి దూసుకెళ్లాయి. ప్రమాదంలో గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని విలపించారు. సమాచారం అందుకున్న ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఉదయగిరి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కార్ల యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

అస్తవ్యస్తంగా బదిలీలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఏహెచ్‌ఏలు


నెల్లూరు (అర్బన్‌): ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో పశుసంవర్ధక శాఖలో సహాయకులకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్‌ను జరపకుండా అస్తవ్యస్తం చేశారని పలువురు ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఏహెచ్‌ఏ శ్రీనివాసులు మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో ఏహెచ్‌ఏలుగా ఆరేళ్లుగా పనిచేస్తున్నామని చెప్పారు. బదిలీలకు సంబంధించిన నోటిఫికేషన్ గత నెల్లో వచ్చిందని, అయితే తమ శాఖలో కనీసం కౌన్సెలింగ్ జరగలేదన్నారు. ప్లేస్‌మెంట్ ఆప్షన్లనూ అడగలేదన్నారు. జిల్లా అధికారులకు అనుకూలంగా ఉన్న వ్యక్తులనే దగ్గరగా బదిలీ చేశారని తెలిపారు. కొంత మందిని ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు సుమారు 200 కిలోమీటర్ల దూరానికి బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొబేషన్ డిక్లేర్ చేయని వారిని కూడా బదిలీ చేసి సీనియార్టీ ఉన్న వారికి అన్యాయం చేశారని, ప్రక్రియను రద్దు చేసి విచారణ జరపాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి

దగదర్తి: కట్టుబడిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై అక్కడే పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు ప్రమీల, ఆమె భర్త ప్రసాద్ సోమవారం దాడి చేశారు. వివరాలు.. ధ్రువీకరణ పత్రాల కోసం పాఠశాలకు ఆమె వచ్చారు. ఎల్పీసీ పత్రాలను అందించి.. ఎస్సార్‌ను నాలుగు రోజుల తర్వాత ఇస్తానని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ ఆయనపై దాడి చేశారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంత్రుల మధ్య మంటలు

- నారాయణపై 'ఆనం' ఆగ్రహం
- వీఆర్ విద్యాసంస్థలపై ఆయన పెత్తనమేమిటి..?
- కార్పొరేట్ కంపెనీల సీఎస్సార్ ఫండ్‌తో అభివృద్ధి చేసి తన ఖాతాలో వేసుకోవడంపై మండిపాటు
- మంత్రి సంస్థ నుంచి ఒక్క రూపాయి ఖర్చు చేయలేదంటూ ఘాటైన విమర్శలు
- మంత్రి లోకేశ్ సాక్షిగా బట్టబయలైన విభేదాలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: షాడో సీఎం లోకేశ్ సమక్షంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మరో మంత్రి నారాయణపై బహిరంగంగా విమర్శలు చేయడం సంచలనం సృష్టిస్తోంది. నగరంలో ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థయిన వీఆర్ హైస్కూల్ పునః ప్రారంభోత్సవ వేదికపై నుంచి ఆ పాఠశాలను మున్సిపల్ హైస్కూల్‌గా మార్చు చేయడంపై వచ్చిన మంత్రి లోకేశ్ సమక్షంలో తీవ్ర స్వరంతో దుయ్యబట్టారు. ఇదే పాఠశాలను మంత్రి నారాయణ కృషి, పట్టుదలతో రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దారని లోకేశ్ ప్రశంసించారు. వాస్తవానికి నెల్లూరులో శతాబ్దాల కాలం నాటి చరిత్ర ఉన్న వీఆర్సీ విద్యాసంస్థలపై మంత్రి నారాయణ ఆధిపత్యం చెలాయించడం మరో మంత్రి రామనారాయణరెడ్డికి కంటగింపుగా మారింది. ఎన్నో ఏళ్లగా వీఆర్సీ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ కమిటీని ఆనం కుటుంబం హస్తగతం చేసుకొని పెత్తనం చెలాయిస్తోంది. తమ నుంచి తాజాగా మంత్రి నారాయణ లాక్కోవడం వారికి రుచించడం లేదు. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే వీఆర్సీ విద్యా సంస్థలపై మంత్రి నారాయణ కన్ను పడింది. అప్పట్లోనే వీఆర్ జూనియర్ కాలేజ్ అంటూ పెత్తనం లాక్కొనే ప్రయత్నం చేశారు. దీంతో మేనేజ్‌మెంట్ కమిటీపై న్యాయ స్థానంలో వ్యాజ్యం వేయించి రద్దు చేసేలా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో ఈ వ్యవహారం మరుగున పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాకతోనే మళ్లీ నారాయణ వీఆర్ విద్యాసంస్థలపై పెత్తనం ప్రారంభించారు. నారాయణ సంస్థల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండానే అమరావతి రాజధానితోపాటు అల్లూరుకు చెందిన బడా కాంట్రాక్టర్ల కంపెనీల నుంచి దాదాపు రూ.15 కోట్ల సీఎస్సార్ ఫండ్స్ సేకరించి హైస్కూల్‌ను పునద్ధరణ చేయించారు. ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. నగర వాసుల్లో ఏదో అభివృద్ధి చేస్తున్నట్లు చూపిస్తూ వెనుక నుంచి వీఆర్సీ విద్యా సంస్థలను గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. వాస్తవంగా న్యాయ స్థానంలో పెండింగ్‌లో ఉన్న ఎయిడెడ్ పాఠశాలను మున్సిపల్ పరిధిలోకి చేర్చడం పెద్ద వివాదమే. చట్టవిరుద్ధంగా మంత్రి నారాయణ వీఆర్సీ విద్యాసంస్థల్ని మున్సిపల్ శాఖ పరిధిలోకి తెచ్చారు. ఎలాంటి తీర్మానాలు లేకుండానే ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొని మంత్రి నారాయణ కార్పొరేట్ సంస్థలాగా మార్చేశారు. ఆ హైస్కూల్‌లో అడ్మిషన్ల నుంచి టీచర్స్ సెలక్షన్ వరకు అన్నింట్లోనూ మంత్రి పెత్తనం చేయడాన్ని మంత్రి ఆనం సహించలేకపోయారు. దశాబ్దాలుగా తమ అధీనంలో ఉన్న సంస్థలను బలవంతంగా నారాయణ లాక్కోవడం రుచించలేదు. మంత్రి లోకేష్ సమక్షంలోనే మంత్రి నారాయణ తీరును ఎండ గట్టడం పెద్ద దుమారమే రేపింది. రూ.వేల కోట్లకు అధిపతిగా ఉన్న మంత్రి నారాయణ తన సంస్థల నుంచి ఒక్క రూపాయి కూడా ఇందులో పెట్ట లేదని మంత్రి ఆనం బహిరంగంగానే విమర్శలు చేయడంతో పాటు ముందు నీ సంస్థ నుంచి ఖర్చు పెట్టమని సలహా ఇవ్వడం పెద్ద చర్చనీయాంశమైంది.

డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్‌): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అమరావతి రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ధనలక్ష్మీపురంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగ గౌరవాధ్యక్షురాలిగా సరోజిని, గౌరవ సలహాదారుగా లీలాకృష్ణ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, జనరల్ సెక్రటరీలుగా వెంకటరమణ, చేజర్ల సుధాకర్‌రావు, కోశాధికారిగా హరిప్రసాద్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జయప్రకాష్, ఉపాధ్యక్షులుగా శివరామకృష్ణ, సయ్యద్ బేగం, మహ్మద్ రఫీ, వెంకటేశ్వర్లు, రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, సాదు వెంకటేశ్వర్లు, రమణ, వెంకటగిరి బాబు, భాస్కర్, కృష్ణమోహన్, మంగమ్మను ఎన్నుకున్నారు. పబ్లిసిటీ సెక్రటరీగా టాటాబాయ్, జాయింట్ సెక్రటరీలుగా అనూరాధ, పద్మావతి, సుమతి, సుబ్బలక్ష్మి, సీతామహలక్ష్మి, లక్ష్మీకుమారి, ధనలక్ష్మి, సునీత, మంగ, విజయకుమార్, అనిల్ ప్రేమ్‌కుమార్, తులసీదేవి ఎన్నికయ్యారు. అనంతరం వీరు ప్రమాణం చేశారు.

క్లుప్తంగా

ఏసీబీ అధికారుల రహస్య విచారణ..?

ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోమవారం ఏసీబీ అధికారులు సాధారణ వ్యక్తుల్లా వచ్చి రహస్య విచారణ చేసినట్లు తెలిసింది. ఉదయం 11 ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు ఓ వాహనంలో అధికారులు వచ్చారు. తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, పోలీస్‌స్టేషన్, సబ్‌ట్రెజరీ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చిన ప్రజలను అధికారులు, సిబ్బంది పని తీరుపై రహస్యంగా ఆరా తీసినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు కార్యాలయాల ఆవరణలో తిరుగుతున్నారని తెలియడంతో అధికారుల్లో అలజడి నెలకొంది.

కాకాణితో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ములాఖత్



వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసుల కారణంగా జిల్లా జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలపై కాకాణితో చర్చించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కొండాపురం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని సాయిపేటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పాటిబండ్ల చిన అంకయ్య తన గేదెలను మేత కోసం పొలాలకు తోలుకెళ్లసాగారు. ఈ క్రమంలో స్థానిక ఎస్సీ కాలనీ వీధిలో విద్యుత్ వైరు తెగిపడి ఉండగా, దానికి గేదె తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వాటిని అటు వైపు వెళ్లనీయకపోవడంతో అవి ప్రమాదం నుంచి బయటపడ్డాయి. విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారమివ్వడంతో సరఫరాను నిలిపేశారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి: రూ.25
సన్నవి: రూ.15
పండ్లు: రూ.05